క్లుప్తంగా

ఈ- ఫార్మర్‌లో నమోదు చేసుకోవాలి

ఎర్రవల్లి: వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పకుండా ఈ- ఫార్మర్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు అందించేందుకు ప్రక్రియ చేపట్టిందన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానం ఉన్న మొబైల్ నంబర్‌ను తీసుకొని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగ విత్తనాల ధర రూ.4,275 ఉందని 50శాతం సబ్సిడీపై రూ.2,137.50 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డును తీసుకొని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి పర్మిట్ తీసుకొని ఎర్రవల్లి సింగిల్ విండో సొసైటీలో నేరుగా విత్తనాలను తీసుకోవాలని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడపరాదు



ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని నర్సన్‌దొడ్డి చౌరస్తా, చింతరేవుల గ్రామాల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై 4 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్వాల వాసికి డాక్టరేట్



గద్వాల: పట్టణానికి చెందిన శివకేశవరెడ్డి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. భారతదేశంలో వ్యవసాయ రుణం, తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులపై అధ్యయనం అంశంపై ప్రొఫెసర్ వి.శేఖర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా శనివారం శివకేశవరెడ్డికి పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

గద్వాల క్రైం: విద్యుదాఘాతంతో 4 మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని అనంతపురం గ్రామ శివారులో శనివారం జరిగింది. శనివారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో సెల్‌ఫోన్ టవర్ వైపునకు మూగజీవలు పరుగులు తీశాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ గురై నాలుగు మేకలు మృతి చెందాయి. వాటి విలువ రూ. 50వేలు ఉంటుందని బాధితుడు పరుశరాములు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



ఖిల్లాఘనపురం: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియన్ రెడ్ క్రాస్ వారికి అప్పగించినట్లు ఫౌండర్ కాగితాల మధు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఎస్ఎల్ మురళీకృష్ణ, బుచ్చిబాబుగౌడ్, ఆగారం ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టి, సమాజంలో ఉన్నతంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మహేందర్, మునగాల బాబు, యువకులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

- రంధ్రాలు పడిన కాజ్‌వే
- శిథిలమైన కల్వర్టులు
- భారీ వాహనాలకు నో ఎంట్రీ



ఉప్పల్ క్యాంప్ శివారులో శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్(ఫైల్)

అయిజ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలిపేందుకు ఏర్పాటు చేసిన కర్నూలు- రాయచూర్ రోడ్డు శిథిలమైంది. మున్సిపాలిటీ శివారులోని నాలుగు కల్వర్టులు, కాజ్‌వే పూర్తిగా దెబ్బతినడంతో మూడు రాష్ట్రాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. కాజ్‌వేపై పెద్ద పెద్ద రంధ్రం పడి భారీ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా అటకెక్కడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తరచూ ప్రమాదాలు

అంతర్రాష్ట్ర రహదారి శిథిలం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గద్వాల జిల్లాలో మూడేళ్ల కాలంలో జరిగిన 45 రోడ్డు ప్రమాదాల్లో 26 మంది మృతి చెందగా, 19 మంది గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ ప్రమాదాల్లో ఎక్కువ శాతం ఈ రహదారిపై జరిగినవే. గతేడాది కలెక్టర్ శిథిలమైన కాజ్‌వేను పరిశీలించారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పర్యటించి కల్వర్టులను పరిశీలించారు.

తాత్కాలిక మరమ్మతు

అయిజ సమీపంలో నిర్మించిన కాజ్‌వేకు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. 2009 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో కాజ్‌వే నిర్మాణానికి సంబంధించిన రాళ్లు నీటి ప్రవాహంలో కొట్టుకపోయాయి. అప్పటి నుంచి కాజ్‌వే అంచెలంచెలుగా శిథిలావస్థకు చేరుతు వస్తోంది.

మరో మార్గం లేదు

కర్నూలు- రాయచూర్ రోడ్డులో భాగంగా ఏర్పాటు చేసిన రోడ్డు అయిజ మండలంలో పూర్తిగా దెబ్బతింది. ముఖ్యంగా నాలుగు కల్వర్టులు శిథిలమయ్యాయి. కాజ్‌వే ప్రయాణానికి పనికి రాకుండా పోయింది. ఇతర రోడ్డు మార్గం గుండా వెళ్దామంటే మూడు రాష్ట్రాల ప్రజలకు వేరే రోడ్డు మార్గం లేకుండా పోయింది. వేరే మార్గాల్లో వెళ్లాలంటే గద్వాల మీదుగా ప్రయాణించాల్సి వస్తోందని దీంతో 50 నుంచి 100 కి.మీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. అదే విధంగా అత్యవసర వైద్య సేవలకు కూడా ఆటంకం కలుగుతుంది.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

మూడు రాష్ట్రాల ప్రజలకు ప్రయాణం సులభతరం కావాలంటే అయిజ పట్టణ సమీపంలో కర్నూలు- రాయచూర్ రోడ్డుపై అయిజ సమీపంలో ఉన్న పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. దీని కోసం ఆర్ అండ్‌బీ అధికారులు అనేక సార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా అవి బుట్టదాఖలయ్యాయి. ఈ ఏడాది హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.18 కోట్ల అంచనాతో ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్ఈకి ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా నాలుగు కల్వర్టులు నిర్మాణానికి గతంలో రూ.3 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకోకపోవడంతో ఇప్పటి వరకు నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు.



అయిజలో శిథిలమైన కాజ్‌వేపై అధ్వాన స్థితిలో రహదారి



అయిజ శివారులో వరదనీటిలో కల్వర్టుపై వెళ్తున్న వాహనదారులు

అంబులెన్స్ సేవలకు ఆటంకం



అత్యవసర సేవలందించేందుకు కర్నూలుకు క్షతగాత్రులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. వర్షం పడిన ప్రతిసారి అయిజ శివారులోని రోడ్డుపై వరద నీరు ఉప్పొంగుతుంది. ముఖ్యం అయిజ సమీపంలోని రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తేనే ప్రయాణం సాఫీగా ఉంటుంది.

\- శ్రీధర్, అంబులెన్స్ పైలెట్, అయిజ

వైద్య సేవలకు ఆలస్యం



అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు అయిజ రోడ్డుపై వెళ్లాలంటే ఆస్పత్రికి చేరుకోవడం ఆలస్యమవుతుంది. గోల్డెన్ అవర్స్‌లో వైద్య చికిత్సలు అందించకుంటే ప్రాణాలు పోతున్నాయి. రోడ్డు బాగలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లడం ఆలస్యమవుతుంది.

\- నరసింహులు, అంబులెన్స్ ఈఎంటీ

నివేదిక పంపించాం

అయిజలో శివారులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.18 కోట్లకు ఎస్టిమేషన్ వేశారు. గత ఏడాది ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని అంతర్రాష్ట్ర రహదారిపై నాలుగు కల్వర్టులు నిర్మించేందుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. సమస్య తీవ్రతపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

\- రాజేందర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. బక్రీద్ పండగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో చెక్‌పోస్టును జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం సందర్శించారు. పశుసంవర్ధక శాఖ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటనారాయణ, పశువైద్య అధికారులు శంకరయ్య, వెంకట్రాజు, జూనియర్ అసిస్టెంట్ భీమయ్య, సత్యమ్మ, ఓఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు



అయిజ: మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు కొన్ని రోజులుగా ఆటంకం ఏర్పడింది. దీంతో 4, 16 వార్డుల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడారు. భూమిలో వేసిన పైపులైన్ పూడుకుపోవడదంతో నీటి సరఫరా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు మున్సిపల్ సిబ్బందితో పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్న అంశాలు అమలు చేయాలి



అలంపూర్‌లో శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఆర్పీలు

- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

అలంపూర్: శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలని కోర్సు డైరెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ కృష్ణ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయం, ఎఫ్ఎల్ఎన్ పాఠశాల సంసిద్ధత, స్కూల్ రికార్డులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు, యాక్షన్‌ప్లాన్ గురించి వివరించారు. కోర్స్ డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణలో తెలుసుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో ప్రస్తావించాలన్నారు. జూన్ 6వ తేదీ నుంచి పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్పీలను, ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు వీరేశప్ప, నాగరాజు, ఎల్ల కృష్ణ, పద్మనాభశాస్త్రి, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సెంటర్ ఇన్‌చార్జ్ రాములు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చివరి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సెంటర్ ఇన్‌చార్జ్ రాములు మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ విద్యా విధానాన్ని బలోపేతం చేసేందుకు ఇన్‌సర్వీస్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టు: ప్రభుత్వ పాఠశాలలో కల్పించే సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని కోర్సు డైరెక్టర్, గట్టు ఎంఈఓ నల్లారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం గద్వాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం చివరి రోజు గ్రంథాలయం, ఎఫ్ఎల్ఎన్, పాఠశాల సంసిద్ధత, స్కూల్ రికార్డులు, తల్లిదండ్రుల సమావేశం గురించి వివరించారు. జూన్ 6 నుంచి నిర్వహించే బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలసి వారిని బడికి రప్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల బోధన, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు కుల్దీప్‌నయ్యర్, రంగన్న, విక్రమసింహాచారి, మహేష్, సతీష్, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.



అయిజలో శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

యుగమానోత్సవం విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీరశైవ సమాజం నాయకులు

అలంపూర్: ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం విజయవంతం చేద్దామని వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు సీ.నీలప్ప పిలుపునిచ్చారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను వీరశైవ సమాజం జిల్లాల అధ్యక్షుడు నీలప్ప, ముక్తా శ్రీశైలం, ఘంటామఠం గురుపాదయ్య, బస్నప్ప, నాగమల్లయ్య, విశ్వనాథ్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యుగమానోత్సవ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జగద్గురువుల ఆశీర్వాద కార్యక్రమం జూన్ 16న భూత్పురులోని వాసవీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి శ్రీమద్ ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు సిద్ధిలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వాములు, శ్రీమద్ శ్రీశైల సూర్య సింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు డాక్టర్ చన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వాములు, కాశీ జ్ఞానసింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వాములు, డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వాములు హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. వీరశైవ సమాజం పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైఖరితో సమాఖ్య వ్యవస్థకు నష్టం



మాట్లాడుతున్న నాయకులు

గద్వాల: బీజేపీ వైఖరితో సమాఖ్య వ్యవస్థకు నష్టమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.శ్రీరాం నాయక్, ఎంవీ రమణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక లక్షణమైన కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలను బలోపేతం చేసే సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. దేశం మొత్తం మీద దక్షిణ భారతదేశం నుంచే కేంద్ర ప్రభుత్వానికి 60 శాతం పన్నుల రూపంలో ఆదాయాన్ని అందుతుందని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రాలకు 20 శాతం మించి ఆదాయాన్ని తిరిగి ఇవ్వడం లేదన్నారు. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకలి దారిద్ర్యం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం నుంచి తప్పించుకోవటానికి బీజేపీ మత విద్వేషాలు, విభజన రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో రెపల్లే దేవదాసు, రాజు, మద్దిలేటి, ఉప్పేరు నర్సింహ, ఈదన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంఘాలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహ

శాంతినగర్: కిషోర బాలికల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన సంఘాలు బలోపేతం కావాలని వడ్డేపల్లి మండల విద్యాధికారి నరసింహ అన్నారు. వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన టాస్ కమిటీ శిక్షణ కార్యక్రమం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఐకేపీ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాలికల సంఘాల అభివృద్ధి గురించి సభ్యులకు ఎంఈఓ వివరించారు. ఎంవీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్ సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం మహేష్, టాస్ జిల్లా సభ్యులు రజిత, శ్రీదేవి, మండల కమిటీ సభ్యులు ఎల్లేశ్వరి, శిరీష్, దేవి, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించండి మహాప్రభో



పైప్‌లైన్ లీకేజీతో ఏర్పడిన మురుగు



పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ 15 రోజులుగా లీకవుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ ప్రదేశం మురికి కూపంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. ఈ నేపథ్యంలో స్థానికులు ముక్కులు మూసుకొని తిరుగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. శనివారం తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు చేశారు గాని మురగును మాత్రం తొలగించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రవల్లి: బీచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఏఈ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీచుపల్లి సబ్‌స్టేషన్, 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని ఎర్రవల్లి, బీచుపల్లి, కొండపేట, తిమ్మాపురం, యాక్తాపురం, కొండేరు, పదవ బెటాలియన్, జింకలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాతలపై అదనపు భారం

- సరఫరా కానీ సబ్సిడీ పరదాలు
- అద్దెకు టార్పాలిన్లతో అదనపు ఖర్చు
- ధాన్యం కాపాడుకునేందుకు తప్పని తిప్పలు



కేటీదొడ్డిలోని కొనుగోలు కేంద్రంలో అద్దె టార్పాలిన్లపై వడ్లు ఆరబోసిన రైతులు

కేటీదొడ్డి: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు, ఆరబెట్టేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు టార్పాలిన్లు అందించేది. మూడేళ్ల పాటు పథకాన్ని కొనసాగించి అనంతరం ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో అన్నదాతలపై నెలకు సుమారు రూ.2 వేల నుంచి రూ.3000 వరకు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెకు టార్పాలిన్లు

మండల పరిధిలో సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం తీసుకొచ్చి టార్పాలిన్లు కప్పి ధాన్యం నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయడాన్ని నిలిపివేయడంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అద్దెకు టార్పాలిన్లను తీసుకురావడంతో అదనపు భారం పడుతోందని ఆవేదన చెందుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు టార్పాలిన్లను అద్దెకు ఇచ్చే దుకాణాలకు గ్రామాల్లో ఏర్పాటు చేసి ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ. 15 వరకు అద్దె తీసుకుంటున్నారు. సాధారణంగా ప్రతి రైతుకు కనీసం ఆరు నుంచి పది టార్పాలిన్ల వరకు అవసరం ఉంటుంది. దీంతో రోజుకు రూ.150 వరకు భారం పడుతోంది. పంట మార్పిడి చేయడం ఆరబెట్టడం సంచుల్లో నింపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి కనీసం 15 రోజుల సమయం పడుతోంది. ఈ లెక్కన రైతులపై టార్పాలిన్ల భారం దాదాపు రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకు పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.



కేటీదొడ్డిలోని కొనుగోలు కేంద్రంలో రైతులు అద్దెకు తెచ్చుకున్న టార్పాలిన్లు

ఏటా అదనపు భారం



ఏటా ధాన్యం అమ్ముకునే సమయంలో టార్పలిన్ల అద్దె కోసం రూ.3 వేల నుంచి 4 వేల ఖర్చు అవుతోంది. దీంతో అదనపు భారం పడుతోంది. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీపై టార్పలిన్లు అందజేయాలి. అకాల వర్షాలు, అదనపు భారంతో రైతులు నష్ట పోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- కిష్టప్ప, రైతు, కేటీదొడ్డి

సబ్సిడీపై అందించాలి



రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ధాన్యంపై కప్పడానికి టార్పలిన్ల కోసం ప్రైవేటు దుకాణాల వైపు పరుగులు పెడుతున్నాం. సబ్సిడీపై ప్రభుత్వం టార్పాలిన్లు అందించాలి. లేదా కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి.

\- రమేష్, రైతు చింతలకుంట